గిరి గ్రామాల్లో విద్యుత్ వెలుగులు



తోటలగరువు గ్రామంలో ఆదివాసీ గిరిజనుడి ఇంటిలో విద్యుత్ లైటు వెలుగు

43 గ్రామాల్లో చేపట్టిన విద్యుదీకరణ సంబంధించిన వివరాలు	
విద్యుత్ స్థంబాలు	1167
డీటీఆర్(ట్రాన్స్‌ఫార్మర్లు)	43
కండక్టరు విద్యుత్ లైన్ వైరు	20.85కిలోమీటర్లు
ఏబీ కెబుల్ వైరు	20.1కిలోమీటర్లు
విద్యుత్ లబ్ధిదారులు	1694 మంది



విద్యుత్ సౌకర్యం గురించి స్థానికులతో మాట్లాడుతున్న విశాఖ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మహేంద్రనాథ్

జి.మాడుగుల: దశాబ్దాలుగా గిరి గ్రామాలు అంధకారంలో ఉండేవి.. ఆదివాసీలు చీకట్లోనే జీవనం సాగించే వారు.. విద్యుత్ సదుపాయం లేక నానా అవస్థలు పడేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ గ్రామాల్లో రహదారులు, తాగునీటి సమస్య, విద్యుత్ సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు లేవు.. చంద్రబాబు పాలనలో ఆదివాసీ గ్రామాల్లో అంధకారం అలముకొని ఉండేది... కొండలపై ఉన్న గ్రామాలు కావడంతో రాత్రిళ్లు అడవి జంతువుల బారి నుంచి రక్షణ పొందేందుకు పడిన కష్టాలు వర్ణనాతీతం. కనీస మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అప్పట్లో చంద్రబాబు కనీస దృష్టి సారించలేదు. దీంతో గ్రామస్తులు సమస్యలతో సహవాసం చేశారు... అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి.

శరవేగంగా పనులు

గిరిజన ప్రాంతాల్లో ప్రతి ఆదివాసీ కుటుంబాలకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జి.మాడుగుల మండలంలో 43 పీవీటీజీ, నాన్ పీవీటీజీ గ్రామాల విద్యుదీకరణ పనులకు రూ.5,00,29,375ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 27 గ్రామాల్లో పనులు పూర్తికాగా, ఇంకా 16 గ్రామాల్లో పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. మండలంలో కారాపల్లి పంచాయతీలో 30 సంవత్సరాల కితం తోటగొంది గ్రామం ఏర్పడింది. అప్పటి నుంచి గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేదు. కొన్నేళ్ల క్రితం డీడీజీ ప్లాంట్(సోలార్ ప్లాంట్) ఏర్పాటు చేసి విద్యుత్ కల్పించటం జరిగింది. సోలార్ ప్లాంట్ మూడు సంవత్సరాలు పనిచేసి తరువాత మరమ్మతులకు గురైంది. దీంతో తోటలగొంది గ్రామం అంధకారమైంది. విద్యుత్ శాఖ అధ్వర్యంలో ఇటీవల తోటలగొంది గ్రామానికి రూ.7.93లక్షలతో 13 కిలోమీటర్లు విద్యుత్ లైను, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రిడ్ విద్యుత్ సౌకర్యం కల్పించి గ్రామంలో నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యం అందించడంతో ఆదివాసీల్లో ఆనందం వెల్లివిరిసింది. గ్రామంలో గల 17ఆదివాసీ కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ప్రభుత్వం అందించింది. గ్రామంలో గ్రిడ్ విద్యుత్ సౌకర్యం కల్పించటం వలన రాత్రి సమయాల్లో ఇంటి పనులు చేసుకోవడానికి, పిల్లలు చదువుకోవటానికి ఇతరత్రా అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఆదివాసీ, నాన్ ఆదివాసీ గ్రామాల్లో చేపడుతున్న విద్యుదీకరణ పనుల్లో మండలంలో తోటలగొంది గ్రామాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఎల్.మహేంద్రనాథ్ సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు.



తోటలగొంది గ్రామానికి విద్యుత్ లైన్ ఏర్పాటుకు వేసిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న ఎస్‌ఈ మహేంద్రనాథ్



గడుతూరు పంచాయతీలో పీవీటీజీ గ్రామం

ఆనందంగా ఉంది



తోటలగొంది గ్రామంలో 30 సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో జీవనం సాగించాం. మా గ్రామంలో 17 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గతంలో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసినా, మూడేళ్ల తరువాత పాడైంది. దీంతో రాత్రి సమయాల్లో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొన్నాం. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటర్లు అందించి విద్యుత్ నిరంతరంగా విద్యుత్ సరఫరా అందించటంతో మా సమస్యలు పరిష్కారమయ్యాయి. చాలా ఆనందంగా ఉంది.

– పాంగి మల్లేశ్వరరావు, తోటలగొంది గ్రామం, జి.మాడుగుల మండలం

తొలగిన కష్టాలు



స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు విద్యుత్ సౌకర్యం లేక రాత్రి సమయాల్లో చీకటిలో అలమటించేవారం. కొండ ప్రాంతం కావడంతో రాత్రిళ్లు అడవి జంతువులు, విష సర్పాల బెడద ఎక్కువగా ఉండేవి. బిక్కుబిక్కుమంటూ జీనవం సాగించాం. విద్యుత్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు మా గ్రామానికి కరెంట్ సౌకర్యం కల్పించటంతో ఇబ్బందులు తొలిగాయి చాలా ఆనందంగా ఉంది.

– తాంబేలి గోపాలరావు, చాపగెడ్డ గ్రామం, జి.మాడుగుల మండలం

క్లుప్తంగా

52 మందికి వైద్య సేవలు



కింద్రలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో లాగరాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషశ్రీ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో 52 మందికి వైద్య పరీక్షలు చేశామన్నారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసి, ఆరోగ్య సలహాలు ఇచ్చినట్టు చెప్పారు. సుగర్, బీపీ సమస్యలున్న వారికి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా ఇచ్చామన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. 104 డీఈఓ శ్రీనివాస్, పీహెచ్‌సీ సిబ్బంది సేవలందించారు.

దుర్గంధంతో సతమతం



ఎంపీడీవో క్వార్టర్స్ వద్ద పేరుకుపోయిన చెత్త

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీవో క్వార్టర్స్‌తో పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకపోయి ఉంది. కొద్ది రోజులుగా చెత్త తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో పేరుకుపోయిన చెత్త వల్ల దుర్గంధం వస్తుండడంతో నివసించలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, ఈగల బెడద ఎకువైందని, రోగాలు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బొర్రాలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు గంగరాజు, అరుణ, సర్పంచ్ అప్పారావు తదితరులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు గంగరాజు, అరుణ, సర్పంచ్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ పర్యాటక కేంద్రం కావడంతో పర్యాటకులు ఎక్కువగా ఇక్కడికి వస్తుంటారని, స్థానికులతో పాటు పర్యాటకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేశామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి డానియేలు, అడ్వకేట్ రాంబాబు, కన్వీనర్ నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



మూగజీవాలకు చేతి పంపుద్వారా నీరు అందిస్తున్న గ్రామస్తుడు

రాజవొమ్మంగి: మండలంలో బుధవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అల్లూరి జిల్లాలోని కూనవరం, రాజవొమ్మంగి, గంగవరం మండలాల్లో గడిచిన రెండు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే మొదలైన సూర్యుడు భగభగలు సాయంకాలం 5 గంటల తరువాత కూడా చుర్రుమనిపిస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే సాహసం చేయడంలేదు.

దీంతో జన జీవనం స్తంభించింది. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. శీతల పానీయాలు, కొబ్బరిబొండాలు, తాటిముంజలు వంటి విక్రయాలు జోరందుకున్నాయి. మూగజీవాలు చెట్ల నీడన సేదతీరాయి. దాహార్తితో అలమటిస్తు కనుపిస్తున్నాయి.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న గ్రేస్ సంస్థ నిపుణులు

కొయ్యూరు: మండలంలోని నడింపాలెంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్రేస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సంపత్‌బాబు మాట్లాడుతూ మండలంలోని మూడు రోజులుగా నడింపాలెం, రాజేంద్రపాలెం పీహెచ్‌సీల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించినట్టు చెప్పారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశానుసారం వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఎంపీహెచ్‌ఈవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు

- అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం



సాక్షి,పాడేరు: జిల్లాలోని కొండదొర ఉపతెగపై కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, కొండదొరలకు ఎక్కడ ఎలాంటి అన్యాయం జరగలేదని వైఎస్సార్‌సీపీ అరకులోయ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన మంగళవారం ‘సాక్షి’తో మాట్లాడుతూ కొండదొరల ఉపతెగకు సంభందించి కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. గ్రామ సచివాలయాల వెబ్‌సైట్‌లో కొండదోర్స్ ఉప తెగగా ఉందన్నారు.ది గెజిట్ ఆఫ్ ఇండియాలో ఉన్న విధంగానే కొండదోరస్‌గా కొనసాగుతున్నామన్నారు.కొండదోరస్‌గా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నందున కొండదొరలు ఎలాంటి ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ఇకపై కొండదొరలు కులం చెప్పినప్పుడు కొండదోరస్‌గా చెప్పి ధ్రువపత్రాలు పొందవచ్చన్నారు.వాస్తవాలు తెలియని కొందరు నేతలు గందరగోళం సృష్టించి, రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం భావ్యం కాదని ఆయన ఖండించారు.

ఘనంగా అమ్మవారి పండగ

ఎస్.రాయవరం : మండలంలో పెట్టుగోళ్లపల్లి గ్రామంలో శ్రీ గుడెమ్మ తల్లి ప్రతిష్ట వార్షిక మహోత్సవం పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, రైతులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. రైతులు వ్యవసాయ ఫలసాయాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నాణ్యమైన మిడ్డే మీల్స్ తయారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ పద్మావతి



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధికారి గిడ్డి అప్పారావు నాయుడు

కొయ్యూరు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం తయారీపై మిడ్డే మీల్స్ నిర్వాహకులు, వంట కార్మికులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజు వారీ మెనూకు అనుగుణంగా వంటకాల తయారీ గురించి మాస్టర్ ట్రైనీ పద్మావతి వివరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించనున్న భోజనంలో పోషక విలువలున్న ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రమణ, ఈశ్వర్, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

చింతపల్లిరూరల్ : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా అధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు.బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వంట కార్మికులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 189 ప్రభుత్వ పాఠశాలల్లో 294 మంది వంట కార్మికులు పనిచేస్తున్నారన్నారు.అల్లూరి జిల్లాలో ఎంపిక చేసిన నలుగురు వంట కార్మికులకు విజయవాడలో రెండు రోజులు నాణ్యమైన వంటల తయారీలో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ తీసుకున్న వారు అన్ని మండలాల్లో ప్రతి ఒక్క పాఠశాల వంట కార్మికులకు ఒక్క రోజు శిక్షణ ఇస్తారన్నారు.ఈ సందర్భంగా మంచిగా వంట చేస్తున్న కార్మికులకు బహుమతులు అందించారు. ఎంఈవోలు పనసల ప్రసాద్, బోడెం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

కూనవరం: అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం కాగా, సుమారు రూ. 3.80 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిన సంఘటన మండలం పరిధిలోని గొమ్ముగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలో నివాసముంటున్న కంటే బాబూరావు, కోకిరాల అనంతరావులకు చెందిన ఇళ్లు బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఆయా ఇళ్లకు సమీప చెరువు వద్ద చెత్తకుప్పలు తగలబడగా వాటి నుంచి ఎగిసిపడిన మంటలు పూరిళ్లపై పడ్డాయి. గ్రామస్తులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అయితే ఫైర్ ఇంజిన్ వచ్చేలోగా సర్వం కాలి బూడిదైనట్టు స్థానికులు చెప్పారు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి, ఒక్కో బాధిత కుటుంబానికి 25 కేజీలు బియ్యం, కందిపప్పు, మంచినూనె, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరకులను అందజేశారు. త్వరలో ప్రభుత్వ సహాయం అందజేస్తామని చెప్పారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్‌కు చెందిన చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున తక్షణ సాయం కింద నగదు అందజేశారు. బాధిత కుటుంబాలను అందరూ ఆదుకోవాలని కోరారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇళ్లు

శిథిలావస్థలో సామూహిక వేదిక

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం అవరణలో ఉన్న మండల పరిషత్ సామూహిక వేదిక శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ వేదిక ప్రభుత్వ, వివిధ ప్రైవేట్ కార్యక్రమలకు ఉపయోగించేవారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. వేదిక లేకపోవడంతో ప్రతి కార్యక్రమానికి వేరే చోట వెళ్లాల్సి వస్తోందని స్థానికులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చేయించి, సామూహిక వేదికను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.



మండల పరిషత్ సామూహిక వేదిక దుస్థితి

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



విద్యావనరుల కేంద్రం వద్ద పాఠ్యపుస్తకాల లోడు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రానికి బుధవారం సాయంకాలం మరో 6, 743 పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈవో–2 సూరయ్యారెడ్డి తెలిపారు. ఇప్పటికే మండలానికి 10, 381 నోట్స్‌బుక్స్, 9వ తరగతికి చెందిన 6, 903, 10వ తరగతికి చెందిన 5, 984 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వీటిని పాఠశాలలు పునఃప్రారంభించిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామన్నారు.

ఎకరాకు 10 టన్నుల పశువుల గెత్తం వేసుకోవాలి

అనకాపల్లి : వర్షాధార చెరకు పంటకు నేల తయారుచేసుకుని, ఎకరాకు 10టన్నుల పశువుల గెత్తం పొలంలో వేసి కలిపి దున్నుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ పీవీకె. జగన్నాథరావు అన్నారు. తమ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 120 రోజుల వయసు గల చెరకు మొక్క, కార్సిచేసిన తోటలో మొక్కల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని సూచించారు. వర్షాలకు కలుపు సమస్య ఎక్కువగా ఉంటుందని, కలుపు సమస్య అధికంగా ఉన్నచోట మెట్రిబుజిన్ 400 గ్రా.., 2,4–డి సోడియం సాల్ట్ 800 గ్రా..ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు. ఎక్కడైనా ఇంకా పచ్చిరొట్ట పైరును విత్తుకోని రైతులు, తేమను చూసుకుని జనుము, జీలుగ, పిల్లిపెసర, అపరాలు రైతులు వేసుకోవాలని ఆయన కోరారు.

సామూహిక వివాహాలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలోని సెయింట్ థామస్ లూథరస్ చర్చిలో బుధవారం తొమ్మిది జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. చవిటిదిబ్బలు గ్రామంలోని వాల్మీకిపేటలో నివాసముంటున్న పేద కుటుంబాలకు చెందిన నేబుల వినోద్‌కుమార్– సత్యవేణి, మద్దికొండ నానిబాబు–కాసులమ్మ, మద్దికొండ అనీల్‌బాబు–రజిని, బుంగ విజయబాబు–సౌందర్య, నక్క సంతోష్–శివమహేశ్వరి, తాటిపాక జయరాజు–అశ్విని, చిన్నెల లోవ కృష్ణ–వెంకటలక్ష్మి, వేమగిరి వీరబాబు–మంగ, గొర్లె అనీల్‌బాబు– పద్మ, జంటలకు పాస్టర్ పి.గాబ్రియేల్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ సంప్రదాయపద్ధతితో వివాహ వేడుక జరిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పాస్టర్ గాబ్రియేల్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పేద జంటలకు వివాహం జరిపించడం ఆనందంగా ఉందన్నారు. చర్చి సిఆర్ గొర్లె చిన్నబ్బులు, సంఘ పెద్దలు, గ్రామ పెద్దలు వివాహ వేడుకకు ఆర్థిక సాయం అందించారు.



చవిటిదిబ్బలులో సామూహిక వివాహ వేడుక

గ్రామ వలంటీర్ మృతికి సంతాపం

పాడేరు : గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని లగిసపల్లిలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న తలారి శ్రీకాంత్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరకు ఎంపీ అభ్యర్థి భర్త చెట్టి వినయ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ సోషల్ మీడియా విభాగ జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్‌కుమార్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, ఎంపీటీసీ లకే రామకృష్ణపాత్రుడు, గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్మా రాంబాబు, పార్టీ విద్యార్థి విభాగ జిల్లా కార్యదర్శి కొమ్మా పద్మనాభం, ఇతర నాయకులు గ్రామానికి చేరుకొని శ్రీకాంత్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం శ్రీకాంత్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి రాధాకృష్ణ తదితరులున్నారు.



శ్రీకాంత్ అంత్యక్రియల్లో వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, నాయకులు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆర్‌జేడీ చిన్మయిదేవి

పాడేరు : రుతుస్రావం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మంచి పోషకాహారన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ ఆర్‌జేడీ పి.చిన్మయిదేవి సూచించారు. బుధవారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పీరియడ్ ఫెస్టివల్(మాసిక మాహోత్సవం)–2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు రుతుస్రావంపై అవగాహన కల్పించారు. ఆర్‌జేడీ చిన్మయిదేవీ మాట్లాడుతూ కౌమర దశలో ప్రతి బాలిక నేలవారి వచ్చే రుతుస్రావంలో కడుపునొప్పి రావడం, వాంతులు రావడం, విరేచనాలు రావడం, నీరసంగా ఉండడం జరిగితే అలసత్వం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతి మూడు గంటలకు ఒక శానిటరీ ప్యాడ్‌ను మార్చుకోవాలని, సరైన పోషకాహారం తీసుకోలన్నారు. కౌమర దశలో పోషకాహార లోపం వలన రక్త హీనత అధికంగా ఉంటుందన్నారు. రుతుస్రావ సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడం కారణంగానే నేటి సమాజంలో ఇప్పటికి కూడా మహిళలను వెనుకబాటుతనంతో చూస్తున్నారని, ఇది తగదన్నారు. ఈ విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అధిక సంఖ్యలో బాలికలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీచర్ మృతి

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ పాఠశాలలో (ఎస్ఏ)సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గబులంగి కృష్ణంరాజు బుధవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మొండిగెడ్డ గ్రామానికి చెందిన ఆయన తన ఇంట్లో ఉన్నట్టుండి గుండెపోటుకు గురయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన జర్రెల ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆయన మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయుడు కృష్ణంరాజు మృతిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సంతాపం తెలిపారు.